# ప్రజల కలలను నిజం చేస్తాం..

- అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు
- నాయకన్‌గూడెం సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


నాయకన్‌గూడెం సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, జూన్ 8 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అవకాశం కల్పించిన ప్రజల కలలను నిజం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు అందేలా చూస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచి మండలంలోని 20 గ్రామాల్లో శనివారం సుడిగాలి పర్యటన చేసిన ఆయన నాయకన్‌గూడెంలో జరిగిన సభలో మాట్లాడారు. వారం రోజుల్లో జరిగే క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రజలకు తీపి కబురు చెబుతామని అన్నారు. అధికారులు గ్రామాల్లో ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని, లేదంటే వారిపై చర్యలు తప్పవన్నారు. వచ్చే ఐదేళ్లలో అర్హులందరికీ ఇండ్ల నిర్మాణం జరుగుతుందని, నా సొంత నియోజకవర్గం పాలేరులో మూడేళ్లలోనే నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశాల్లో వచ్చిన దరఖాస్తుల విషయంలో అధికారులు వెంటనే స్పందించాలని, సమావేశాల్లో చెప్పే మాటలే ఆదేశాలుగా పని చేయాలని, లేదంటే తర్వాత ఇబ్బంది పడతారన్నారు. గత ఎన్నికల్లో గ్రామాల్లో పర్యటనల సందర్భంగా ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చేందుకు వచ్చే మూడేళ్లలో కార్యాచరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కంచర్ల పద్మారెడ్డి, పార్టీ నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, రామసహాయం బాలకృష్ణారెడ్డి, జూకూరి గోపాల్‌రావు, సుధాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, హఫీజుద్దీన్, భద్రయ్య, ఉపేందర్, బారి వీరభద్రం, రూరల్ సీఐ రాజిరెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

## బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి


కూసుమంచి బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

కూసుమంచి, జూన్ 8 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, అక్కడే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. కూసుమంచి మండల కేంద్రంలో హెచ్‌ఎం రాయల వీరస్వామి అధ్యక్షతన శనివారం జరిగిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రావీణ్యత గల ఉపాధ్యాయులు, సిబ్బంది, కావాల్సిన వసతులు, వనరులు ఉన్నాయన్నారు. కూసుమంచి హైస్కూల్లో అత్యధికంగా విద్యార్థులు ఉండడం పట్ల పాఠశాల సిబ్బందిని ఆయన అభినందించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టారని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, కళాశాలలు ఏర్పాటు చేసిందని, వీటిలో పూర్తిగా సీట్లు నిండే విధంగా తమ పిల్లలను వాటిలోనే చేర్పించాలన్నారు. అనంతరం కూసుమంచి శివాలయం రోడ్డులో పలు ఇండ్లకు ఉపాధ్యాయులతో వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా పదో తరగతిలో 9.7 జీపీఏ సాధించిన విద్యార్థిని మహాలక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేలా విక్రమ్‌రెడ్డి, శోభన్, శ్రీను, ప్రైమరీ పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు జాఫర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రామయ్యకు స్వర్ణ తులసి పూజలు


సీతారాములకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, జూన్ 8 : భద్రాద్రి సీతారామచంద్రస్వామివారి దివ్యక్షేత్రంలో శనివారం అంతరాలయంలోని మూలవరులకు స్వర్ణ తులసి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం, సేవాకాలం తదితర పూజలను సంప్రదాయబద్ధంగా జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం జరిపి, కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామి వారి ప్రసాదాలను, శేష వస్త్రాలను అందజేశారు.

# నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

## నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21 కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 8,871 మంది అభ్యర్థులు
- ఖమ్మం జిల్లాలో 52 కేంద్రాలు.. 18,403 మంది అభ్యర్థులు
- తొలిసారి బయోమెట్రిక్ విధానం అమలు
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్


ఖమ్మం ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 8 (నమస్తే తెలంగాణ)/మామిళ్లగూడెం : జిల్లాలో టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మొత్తం 8,871 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. ఇప్పటికే వారికి హాల్ టికెట్లు జారీ చేశారు. పరీక్ష నిర్వహణకు మొత్తం 21 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఇప్పటికే స్పష్టం చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాత పరీక్ష ఉంటుంది. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 10 గంటల తర్వాత ఎవరినీ కేంద్రంలోకి అనుమతించరు. తొలిసారిగా బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టడంతో అభ్యర్థులు సకాలంలోనే పరీక్షా కేంద్రాలకు చేరుకుంటే వారిని బయోమెట్రిక్ ద్వారా పరీక్షించి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

### అభ్యర్థులకు పలు సూచనలు..

- పరీక్ష రోజు ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతిస్తారు. కచ్చితంగా 10 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేస్తారు.
- ఉదయం 10 గంటల తర్వాత ఆలస్యంగా వచ్చినా ఎవరినీ లోపలికి అనుమతించరు.
- పరీక్షకు వచ్చిన అభ్యర్థులు హాల్ టికెట్‌పై ఉన్న నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలి.
- అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటు ఒక కలర్ ఫొటో, ఒరిజినల్ ఆధార్ కార్డు/డ్రైవింగ్ లైసెన్సు, ఇతర గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తమ వెంట తెచ్చుకోవాలి.
- హాల్ టికెట్‌లో ఫొటో సరిగా కనిపించకపోతే 3 కలర్ ఫొటోలు తీసుకొని హాల్ టికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకొని రావాల్సి ఉంటుంది.
- అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాన్ని ముందుగా చూసుకుంటే పరీక్ష రోజు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.
- పరీక్ష రాయడానికి బబ్లింగ్ బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్నుతో మాత్రమే అనుమతిస్తారు.
- పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, కాలిక్యులేటర్లు, వైట్ పేపర్స్, పెన్ డ్రైవ్స్ లాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను అనుమతించరు.
- పరీక్ష పూర్తయిన తర్వాత మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎవరినీ పరీక్షా కేంద్రం నుంచి బయటికి పంపించరు.
- అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటారు.

### ఖమ్మంలో 52 పరీక్షా కేంద్రాలు

- హాజరుకానున్న 18,403 మంది అభ్యర్థులు

మామిళ్లగూడెం, జూన్ 8 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ ఆదివారం ఖమ్మం జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్ వీపీ గౌతమ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మొదటిసారిగా బయోమెట్రిక్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొత్తం 52 సెంటర్లు ఏర్పాటు చేయగా, 18,403 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలి. 10 గంటలకు గేట్లు మూసి వేయనున్నారు.

### 8,871 మంది కోసం 21 పరీక్షా కేంద్రాలు


భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రూప్-1 పరీక్ష కోసం మొత్తం 8,871 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా.. 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(లక్ష్మీదేవిపల్లి)-552 మంతి, అబ్దుల్‌కలాం ఇంజినీరింగ్ కాలేజీ-ఏ(వేపలగడ్డ)-606 మంది, అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కాలేజీ-బీ(వేపలగడ్డ)-600 మంది, కేఎల్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ(పాల్వంచ)-480 మంది, ఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ(రామవరం ఎస్‌సీబీ నగర్) 288 మంది, ప్రభుత్వ జూనియర్ కాలేజీ(పోస్టాఫీస్)-432 మంది, సింగరేణి మహిళా జూనియర్ కాలేజీ(కొత్తగూడెం)-408 మంది, నవభారత్ పబ్లిక్ స్కూల్(పాల్వంచ)-480 మంది, వివేకవర్ధిని డిగ్రీ కాలేజీ(లక్ష్మీదేవిపల్లి)-408 మంది, ధన్వంతరి ఫార్మసీ కాలేజీ(సుజాతనగర్)-264 మంది, సెయింట్ మేరీ హైస్కూల్(కొత్తగూడెం)-408 మంది, ఎస్‌ఆర్ డీజీ స్కూల్(రాంనగర్, విద్యానగర్‌కాలనీ)-504 మంది, గిరిజన బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ(నవభారత్)-600 మంది, కృష్ణవేణి జూనియర్ కాలేజీ(లక్ష్మీదేవిపల్లి)-360 మంది, తెలంగాణ శ్రీచైతన్య స్కూల్(లక్ష్మీదేవిపల్లి)-288 మంది, సింగరేణి మహిళా డిగ్రీ కాలేజీ(కొత్తగూడెం)-528 మంది, సెయింట్ జోసెఫ్ హైస్కూల్(రుద్రంపూర్)-240 మంది, త్రివేణి స్కూల్(లక్ష్మీదేవిపల్లి)-225 మంది, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(రుద్రంపూర్)-360 మంది, డీఏవీ పబ్లిక్ స్కూల్(పాల్వంచ)-576 మంది, కేఎల్‌ఆర్ ఫార్మసీ కాలేజీ(పాల్వంచ)-264 మంది.. మొత్తం కలిపి 8,871 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.


కొత్తగూడెంలో చేపలు కొనుగోలు చేసేందుకు బారులు తీరిన ప్రజలు


ఖమ్మం నగరంలో..

# మృగశిర.. చేపల కూర

- కార్తె తొలిరోజు చేపలకు పెరిగిన డిమాండ్
- కొనుగోలు చేసేందుకు పోటీపడ్డ ప్రజలు



ఖమ్మం/కొత్తగూడెం టౌన్, జూన్ 8 : మండే ఎండకు రోళ్లు పగిలిపోయే రోహిణి కార్తె నుంచి వర్షాలతో చల్లదనాన్ని ఆహ్వానించే మృగశిర కార్తెలోకి అడుగు పెట్టాం. కార్తె తొలిరోజే వర్షం ఉమ్మడి జిల్లాను పలకరించింది. మృగశిర కార్తె రోజు చేపల కూర తినడం ఆనవాయితీగా వస్తోంది. దానిని కొనసాగిస్తూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు మృగశిర కార్తె రోజు శనివారం చేపలు కొనేందుకు పోటీపడ్డారు. మార్కెట్లతోపాటు ఎక్కడ చూసినా చేపల విక్రయాలు జోరుగా సాగాయి. ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్, డీఆర్‌డీఏ, కాల్వొడ్డు, గాంధీచౌక్, ముస్తఫా నగర్, ప్రకాశ్‌నగర్, ఇందిరానగర్, ఖానాపురం హవేలి, చర్చి కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో చేపల కొనుగోలుదారులతో సందడి నెలకొంది. కొత్తగూడెం హెడ్డాఫీస్, పెద్దబజార్ రైల్వే స్టేషన్ పక్క సందు, పాల్వంచ, జూలూరుపాడు, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, రుద్రంపూర్‌లోని ప్రధాన సెంటర్లలో చేపలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడ్డారు. ఖమ్మంలో తెల్ల చేపలు కిలో ధర రూ.220-250 ఉండగా.. నల్ల చేపలు రూ.400 నుంచి 500 పలికాయి. ఈ ఏడాది జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెరువులు ఎండిపోవడంతో వ్యాపారులు ఆంధ్రా నుంచి తీసుకొచ్చి విక్రయాలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం కొన్నిచోట్ల చెరువుల వద్ద సందడి నెలకొంది.




ఖమ్మంలో..

# లోక్ అదాలత్‌లో 5,454 కేసులు పరిష్కారం

## భద్రాద్రి జిల్లా జడ్జి వసంత్ పాటిల్


మాట్లాడుతున్న భద్రాద్రి జిల్లా జడ్జి వసంత్ పాటిల్

కొత్తగూడెం టౌన్, జూన్ 8 : కక్షిదారులకు సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నామని, జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 5,454 కేసులు పరిష్కారమయ్యాయని భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని అన్నారు. 12 మోటార్ వాహన ప్రమాద కేసుల్లో బాధితులకు రూ.22,45,000 చెల్లించే విధంగా పరిష్కారం లభించిందని, క్రిమినల్ 3,362, సివిల్ 17, పీఎల్‌సీ కేసులు 98 పరిష్కారమయ్యాయని తెలిపారు. కొత్తగూడెంలో 3,379 కేసులు, ఇల్లెందులో సివిల్ కేసు 1, క్రిమినల్ కేసులు 452, పీఎల్‌సీ కేసులు 27, మొత్తం పరిష్కారమైన కేసులు 453, భద్రాచలంలో క్రిమినల్ కేసులు 1,078, బ్యాంకు కేసులు 40.. మొత్తం పరిష్కారమైన కేసులు 1,118, మణుగూరులో క్రిమినల్ కేసులు 379 పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. కాగా.. భద్రాద్రి కొత్తగూడెం ఎస్‌బీఐ వారి సౌజన్యంతో కక్షిదారులకు పులిహోర, మంచినీటి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తితోపాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి, జడ్జీలు రామారావు, సాయిశ్రీ, శివనాయక్, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, న్యాయవాదులు, బ్యాంకు మేనేజర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

- టాస్క్‌ఫోర్స్ బృందాలు సమష్టిగా పనిచేయాలి
- అడిషనల్ డీసీపీ ప్రసాదరావు

మామిళ్లగూడెం, జూన్ 8 : జిల్లాలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు సమష్టిగా పనిచేయాలని లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ ప్రసాదరావు అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు శనివారం వ్యవసాయ అధికారులు, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నకిలీ, నాణ్యత లేని విత్తనాలు కొనుగోలు చేస్తే ఆర్థికంగా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ అధికారులు విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారని, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించినా కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ కూడా విత్తనాల కొరత లేదనే విషయాన్ని రైతులకు భరోసా కల్పిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది దళారులు ముఠాలుగా ఏర్పడి తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపి రైతులను మోసం చేస్తారని, ఇటువంటి వారిపై గ్రామాల్లో సైతం నిఘా పెట్టామని తెలిపారు. ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసిరకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. జిల్లాలో ఏడు చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు. రైతులు విత్తనాల కొనుగోలు రశీదు తీసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో టాస్క్‌ఫోర్స్ బృందాల నిరంతర పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, ఏడీఏలు శ్రీనివాస్, నరసింహారావు, విజయచందర్, కరుణశ్రీ, శ్రీనివాస్‌రెడ్డి, ఏవో కిషోర్, సీఐ స్వామి తదితరులు పాల్గొన్నారు.

